నాడు- నేడుతో రాష్ట్రంలో చదువుల విప్లవం

- కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ విద్య
- ప్రతి ఏటా విద్య కోసమే రూ.30 వేల కోట్లు ఖర్చు
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందించడం కోసం సీఎం జగన్మోహన్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. రాష్ట్రంలో చదువుల విప్లవానికి నాడు నేడు పథకంతో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాంది పలికి విజయం సాధించారన్నారు. ప్రస్తుతం ఈ పథకం కేంద్రంతో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారిందన్నారు. కేవలం విద్య కోసమే ప్రతి ఏటా రూ.30వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. నేడు రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయి కార్పొరేట్ విద్యా సంస్థలతో పోటీ పడుతున్నాయన్నారు. విద్యాశాఖపై రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న ప్రత్యేక చొరవ, పేద విద్యార్థులకు నాణ్యమైన చదువులు భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నెంబర్ వన్‌గా నిలుపుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

పాఠశాలల రూపురేఖల మార్పు

రాష్ట్రంలో నాడు- నేడు క్రింద మొదటి దశలో రూ.3700 కోట్లతో 15,715 పాఠశాలలను పునరుద్ధరించారని, రెండవ దశలో 16,911 ప్రత్యేక పాఠశాలలతో సహా 22,344 పాఠశాలలను పునరుద్దరించనున్నట్లు తెలిపారు.

అమ్మ ఒడి ప్రత్యేకమైనది

విద్యా పథకాలపై అమ్మ ఒడి పథకం ఒక ప్రత్యేకమైనది. దీని కింద 75శాతం హాజరు ఉన్న ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.15వేలు సహాయం అందించడంతో పాటు తల్లి తన పిల్లలను పాఠశాలలకు పంపేలా ప్రోత్సహిస్తుంది. గత మూడేళ్లలో ఈ పథకం క్రింద మొత్తం రూ.19,617 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు.

గత ప్రభుత్వం కంటే నాలుగు రెట్లు ఎక్కువ

జగనన్న గోరుముద్ద క్రింద రాష్ట్రంలో గత ప్రభుత్వం కంటే నాలుగు రెట్లు ఎక్కువగా ఖర్చు చేస్తున్నామన్నారు. గతంలో చెల్లించలేకపోయిన బకాయిలను కూడా ప్రస్తుత ప్రభుత్వ హయాంలో చెల్లించడం జరిగిందని తెలిపారు.

పాఠశాల పునఃప్రారంభం రోజునే విద్యా కానుక కిట్లు

పాఠశాల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు విద్యా కానుక కిట్లను రాష్ట్ర వ్యాప్తంగా అందిస్తున్నామని, రానున్న సంవత్సరానికి కూడా 930 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందని, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు 5.18 లక్షల ట్యాబ్స్‌ను ప్రభుత్వం అందించిందన్నారు.

దేశంలోనే ఏపీ ఆదర్శం

రాష్ట్ర విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొచ్చి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా నిలిచిందని, విద్యార్థుల హాజరు పెంచడం, ట్యాబ్స్ పంపిణీ, తరగతి గదిలో స్మార్ట్ టీవీ తదితర వాటిని చూసి దేశ వ్యాప్తంగా 14500 పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి, నాడు నేడు పేరుతో పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియాగా మార్చిందన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి

పీలేరు నియోజకవర్గ అభివృద్ధి మరింత కృషి చేస్తామని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. రాష్ట్రాభివృద్ధికి మూలం విద్యార్థులకు నాణ్యమైన చదువులను అందించడమేనని నమ్మిన సీఎం జగన్ సారథ్యంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ రెడ్డి, నీళ్ళభాస్కర్, కేశవ రెడ్డి, రాయుడు, ఆనంద, షావత్ అలి, సద్దాం హుస్సేన్, మహేంద్ర రెడ్డి, మహబూబ్‌ఖాన్, వెంకట్రమణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: మహా శివరాత్రిని పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో-2 మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ప్రముఖ పర్యాటక కేంద్రం, శైవక్షేత్రమైన తలకోనకు మొట్టమొదటి సారిగా శివరాత్రి రోజు 18న మదనపల్లె నుంచి తలకోనకు రెండు పల్లె వెలుగు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. రాను పోను చార్జీలు రూ.240 చెల్లించాలన్నారు. నిమ్మనపల్లె మండలం తవళంలోని నేలమల్లేశ్వరస్వామి ఆలయంకు 18న 5 బస్సులు, 19న 5 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. కలకడ ఝరీ కోనకు 19న 15 బస్సు సర్వీసులు నడుపుతామన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలు జయప్రదం చేయండి

పీలేరు : కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానము ఆధ్వర్యములో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలు జయప్రదం చేయాలని ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం మహాశివరాత్రి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. అర్చకులు కుమార్‌శాస్త్రి మాట్లాడుతూ 16న ధ్వజారోహణము, 17న రుద్రాభిషేకం, హోమాలు, రుద్రా పారాయణము, 18న స్వామివారికి ప్రత్యేకాలంకరణ ఉంటుందన్నారు.

క్లుప్తంగా

శ్రీ లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు

గుర్రంకొండ: తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో విశిష్టమైన పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు.

భక్తిశ్రద్ధలతో గంధం సమర్పణ

మదనపల్లె సిటీ: స్థానిక పుంగనూరు రోడ్డులోని బాబా అబ్దుల్‌హుస్సేని దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శనివారం గంధోత్సవం వైభవంగా జరిగింది. ఉరుసు పురస్కరించుకుని దర్గా పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఇందులో భాగంగా దర్గాలో బాబా ఫరీద్ జెండా ప్రతిష్ఠించారు. బసినికొండ ఆస్థానం నుంచి ఫకీర్ల రాతీబ్‌లతో, మేళతాళాలతో ఊరేగింపుగా బసినికొండ దర్గాకు చేరుకున్నారు. గంధం ఎక్కించి ఫాతెహా నిర్వహించారు. దర్గాలోని మజార్లకు గలఫ్‌లతో అలంకరించారు. కార్యక్రమంలో దర్గా పీఠాధిపతి కె.ఎస్.ఎస్.బి నూర్‌బాబా, బాబా శిష్యులు పాల్గొన్నారు.

వైభవంగా శనేశ్వరునికి మహా తైలాభిషేకం

వాల్మీకిపురం : వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో శనివారం శనేశ్వర స్వామికి మహా తైలాభిషేకం నిర్వహించారు. షిరిడిసాయి సాలిగ్రామ తిరు నారాయణ ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయంలో శాస్త్రోక్తంగా శని మహాత్మునికి విశేష పూజలు, మహాతైలాభిషేకం నిర్వహించారు.

ఎలుక తీర్థం వద్ద పూజలు

తంబళ్లపల్లె : ప్రముఖ పుణ్యక్షేత్రం మల్లయ్య కొండ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయం వెళ్లేదారిలో భక్తులు సందర్శించే ప్రముఖ సందర్శన స్థలం ఎలుక తీర్థం ఉంది. అక్కడ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సలహా మేరకు దాతల ఆర్థిక సహకారంతో ఎలుక రాతి ప్రతిమను ప్రతిష్ఠించారు. పూజారి శ్రీనివాసులు నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

20 లీటర్ల సారా స్వాధీనం

కేవీపల్లె : మండలంలో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఓ నిందితున్ని అరెస్ట్ చేసినట్లు పీలేరు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. వివరాలిలావున్నాయి. మండలంలోని గారిపల్లె పంచాయతీ బురుజుకాడపల్లెలో సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఎస్. సైఫుల్లా సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో సెబ్ సిబ్బంది రాఘవయ్య, సుధాకర్, లోకేష్, సురేష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

మదనపల్లె సిటీ : స్థానిక చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ పాఠశాలలో శనివారం 9వ తరగతిలో ప్రవేశానికి అర్హత పరీక్షలు నిర్వహించారు. 9వ తరగతి ప్రవేశానికి 13 సీట్లకు 611 మంది దరఖాస్తు చేసుకోగా 378 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు.

చేపల వ్యాపారులను ఆదుకుంటాం

పీలేరు : పట్టణంలో చేపల వ్యాపారులను ఆదుకుంటామని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శనివారం స్థానిక వారపుసంత ప్రాంగణంలో నిర్మిస్తున్న చేపలమార్కెట్ రూములను పరిశీలించారు. అనంతరం చేపల వ్యాపారులతో మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చేపల విక్రయాలు చేపట్టకుండా ఒక్క చోట నిర్వహించకోవడానికి వీలుగా చేపల మార్కెట్ షెడ్డుల నిర్మాణానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. షెడ్డుల నిర్మాణానికి ప్రభుత్వం రాయితీ ఇచ్చినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

నిమ్మనపల్లె : రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఫాతిమా తెలిపారు. ఈనెల 2న వెంగంవారిపల్లె పంచాయతీ గొల్లపల్లికు చెందిన గుర్రప్ప(30), కత్తిరివారిపల్లెకు చెందిన సురేంద్ర ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వెళుతుండగా వాల్మీకిపురంకు చెందిన వంశీకృష్ణ తన కారుతో ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్నాడు. ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ఉన్న ఇద్దరు గాయపడ్డారు. బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్సలు అనంతరం గుర్రప్ప పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రూయాకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఘటనపై గుర్రప్ప తండ్రి సీతారామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సారా ఊట ధ్వంసం

కలకడ : నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి 400 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ సిటిస్వామి తెలిపారు. శనివారం మండలంలోని ఎగువతండ, దిగువ తండలలో సారా తయారు చేస్తున్నట్లు అందిన రహస్య సమాచారంతో ఎస్ఐ తనసిబ్బందితో దాడులు నిర్వహించారు. పోలీసుల రాకను గుర్తించిన సారా తయారీ దారులు పారిపోయారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న నాటు సారా ఊటను ధ్వంసం చేసి, బట్టీలను నేలమట్టం చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఫోర్డు సిబ్బంది

మదనపల్లె సిటీ: బడిఈడు పిల్లల బడిలో ఉండాలని స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లిలో శనివారం ఫోర్డు సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ మాట్లాడుతూ బడిఈడు పిల్లలు అందరూ పాఠశాలల్లో నమోదు చేసి వారిని తప్పకుండా చదువుకొనసాగించాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, వంటివి అందిస్తూ బాలల చదువులకు ప్రోత్సహిస్తుందన్నారు. పిల్లలను బడి నిలిపివేయకుండా బాల కార్మికులుగా మార్చకూడదన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ప్రసాద్‌బాబు, ఫోర్డు సిబ్బంది శ్రీధర్, సుభాషిణి, సంపూర్ణ, అల్తాఫ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రేపు భవననిర్మాణ కార్మికుల ధర్నా

మదనపల్లె : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మదనపల్లె సబ్ కలెక్టరేట్ వద్ద బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధానకార్యదర్శి సాంబశివ తెలిపారు. శనివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ..నూతన ఇసుక పాలసీ విధానంతో ఇసుక కొరతను సృష్టించి రాష్ట్ర ప్రభుత్వం భవననిర్మాణ కార్మికులకు నిర్మాణపనులు లేకుండా చేసిందన్నారు. సబ్‌కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మొటుకురమణ, మోదీన్‌బాషా, బెల్లంశ్రీనివాసులు, బాబు, వెంకటరమణ, ఏఐటీయూసీ నాయకులు తంబయ్యశెట్టి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ వాయిదా

మదనపల్లె : బసినికొండ పంచాయతీ డ్రైవర్స్‌కాలనీ సమీపంలో ఆదివారం నిర్వహించాల్సి ఉన్న వాల్మీకిమహర్షి కమ్యూనిటీ భవననిర్మాణ భూమిపూజ కార్యక్రమం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేసినట్లు వాల్మీకి సంఘ నాయకులు తెలిపారు. శనివారం డ్రైవర్స్‌కాలనీలోని వాల్మీకివిగ్రహం వద్ద సమావేశమైన సంఘనాయకులు మాట్లాడుతూ తదుపరి కార్యక్రమ నిర్వహణపై వాల్మీకిసంఘ పెద్దలు డాక్టర్.శివ, దొడ్డిపల్లె ఆనంద ఆధ్వర్యంలో సభ్యులందరూ సమావేశమై నిర్ణయం తీసుకుని భూమిపూజ తేదీని పత్రికాముఖంగా తెలుపుతామన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ



శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

గుర్రంకొండ : మండలకేంద్రంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఆవిష్కరించారు. స్థానిక కలకడ క్రాస్ సర్కిల్‌లో నూతనంగా రాయల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో శనివారం స్థానిక గురంకొండ కోట నుంచి బస్టాండు మీదుగా కలకడ క్రాస్ వరకు ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చుతూ ర్యాలీ కొనసాగింది. అనంతరం శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఆవిష్కరించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రెడ్డిశేఖర్, బలిజ సంఘం నాయకులు సుంకర శ్రీనివాసులు, నక్కాచంద్రశేఖర్, అప్పల్ల, నాయిని జగదీష్, నాయిని శివశంకర్, మేకల చలపతి, సుంకరశేఖర, నక్కాగోపి, సరిమడుగు రమణ తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

డీవైఈఓ కృష్ణప్ప



విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈఓ కృష్ణప్ప

బి.కొత్తకోట: పదవ తరగతి విద్యార్థులను పరీక్షలను సిద్ధం చేసేలా 50 రోజుల ప్రణాళిక అమలు చేయాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కృష్ణప్ప అన్నారు. శనివారం ఆయన మండలంలోని బడికాయలపల్లె ఉన్నతపాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో సమావేశమై ఇప్పటిదాక జరిగిన సిలబస్‌కు సంబంధించిన ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. పది పరీక్షలు మీ భవిష్యత్తుకు కీలకమని, ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంఈవో రెడ్డిశేఖర్, హెచ్ఎం మోహన్‌నాయుడు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.

సమస్యలపై ప్రజల పక్షాన పోరాడుతాం

గుర్రంకొండ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల తరపున పోరాడుతామని బీజేవైఎం జిల్లా కార్యదర్శి నిమ్మనపల్లె పురుషోత్తం అన్నారు. శనివారం గుర్రంకొండలో బీజేపీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బస్టాండులో కోట్లాది రుపాయలు విలువచేసే స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. సమాజంలో అణిచవేతకు గురువుతున్నా అట్టడగు వర్గాల ప్రజల సంక్షేమం కోసం పోరాటం చేస్తామన్నారు. పోలీసులు విద్యార్థులపై అక్రమ కేసులు బనాయించడం తగదన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు రామాంజులు, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నాయుడు, నాయకులు రెడ్డిశేఖర్, వెంకటరమణ, నవీన్, భరత్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వంటల పోటీలు



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ రెడ్డిబాషా

కేవీపల్లె : స్థానిక ఎమ్మార్సీలో శనివారం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మండల స్థాయి వంట పోటీలు నిర్వహించారు. పోటీల్లో పలువురు మహిళలు పాల్గొని వంటలు ప్రదర్శనగా ఉంచారు. ఎంఈఓ రెడ్డిబాషా పరిశీలించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన మస్తానమ్మ ప్రథమస్థానం, గర్నిమిట్ట ఎంపీపీఎస్‌కు చెందిన ఇంద్రాణి ద్వితీయ స్థానం, నారమాకులవడ్డిపల్లె ఎంపీపీఎస్‌కు చెందిన కవిత తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం వై.వి. రమణ పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

కలికిరి: నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 30,790 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా వున్నాయి. శనివారం మండలంలోని మేడికుర్తి పంచాయతీ బాహుదా నది వద్ద పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకోగా, మరో నలుగురు నిందితులు పారిపోయినట్లు ఎస్ఐ తెలిపారు.

మూడో విడత ఇళ్ల పట్టాల పంపిణీకి సన్నద్ధం

పీలేరు రూరల్ : పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మండలంలో మూడో విడత ఇళ్ల పట్టాల పంపిణీకి సన్నద్ధమవుతున్నట్లు తహసీల్దార్ రవి అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మూడో విడతలో 3117 దరఖాస్తులు అప్రూవల్ కాగా అందులో 2065 పట్టాల పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఏపీఐఐసీ లేఅవుట్-3లో ప్లాట్లు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇంకా 868 దరఖాస్తులు వచ్చాయని, వాటిని కూడా త్వరలో పరిశీలిస్తామని తెలిపారు. ఎంబజీకి 20 ఎకరాల స్థలంకు ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. జాతీయ రహదారి విస్తరణ, బైపాస్ రోడ్డు నిర్వాసితులకు రూ.25.70 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. సమావేశంలో డీటీ కిరణ్, ఆర్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

మదనపల్లె : క్రీడలతో విద్యార్థులకు శారీరక, మానసిక వికాసం పెరుగుతుందని వన్‌టౌన్ ఎస్ఐ హరిహరప్రసాద్ అన్నారు. శనివారం రెడ్డీస్‌కాలనీ భాష్యం పబ్లిక్ స్కూల్‌లో ఇంట్రా జోనల్ క్రీడలను ఎస్ఐ హరిహరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎస్ఐ బహుమతులను ప్రదానం చేశారు.

రాజీయే రాజమార్గం



పీలేరు కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్

వాల్మీకిపురం: రాజీయే రాజమార్గమని వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సిహెచ్‌వి రామక్రిష్ణ అన్నారు. శనివారం స్థానిక కోర్టులో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కేసులతో సతమతమవుతున్న కక్షిదారులు సమస్యలను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ చక్కటి వేదిక అన్నారు. అలాగే కోర్టు నందు ప్రతి రోజు నిర్వహిస్తున్న ప్రీ సిట్టింగ్స్ కార్యక్రమం నందు కూడా తమ కేసుల వివరాలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. అనంతరం సివిల్, క్రిమినల్, బ్యాంకుల రుణాలు, తదితర మొత్తం 282 కేసులను పరిష్కరించారు. పలు కేసులకు సంబంధించి రూ.76,19,597 నగదు రికవరీ అయ్యాయన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసులు, కరీముల్లా బేగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డెప్ప, ఏజీపీ అశోక్ కుమార్ రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ తీర్పే అంతిమం

తంబళ్లపల్లె : లోక్‌అదాలత్‌లో రాజీ అయ్యే కేసుల్లో ఇచ్చే తీర్పే అంతిమమని స్థానిక మండల న్యాయ సేవా సంఘం చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఆసీఫా సుల్తానా అన్నారు. శనివారం జడ్జి అధ్యక్షత జరిగిన లోక్‌అదాలత్‌లో ములకలచెరువు పోలీసు సర్కిల్ పరిధిలోని 206 కేసులు పరిష్కారం అయ్యాయి. ఇందులో 10 క్రిమినల్ కేసులు, నాలుగు సివిల్ కేసులు, 192 పెట్టీ కేసులు ఉన్నాయి. లోక్‌అదాలత్ తీర్పు ద్వారా కేసుల నుంచి వసూలైన రూ.10,27,902లను కక్షిదారులకు చెల్లించారు.


లోక్ అదాలత్‌లో 285 కేసులు పరిష్కారం

పీలేరు రూరల్ : స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 285 కేసులు పరిష్కారం అయినట్లు అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. జ్యోతి తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో ఉదయం నుంచి రాత్రి వరకు లోక్ అదాలత్‌లో నిర్వమించారు. వివిధ దీర్ఘకాలిక కేసులకు సంబంధించి రాజీమార్గంలో పరిష్కారం చేశారు. పలు కేసులకు సంబంధించి రూ. 1,26,07,114 రికవరీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ శారద, న్యాయవాది బావాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధే లక్ష్యం

వాల్మీకిపురం : స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధే లక్ష్యంగా పూర్వ విద్యార్థుల అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్లు పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి అన్నారు. శనివారం స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో క్రిష్ణమూర్తి మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కళాశాల పూర్వ విద్యార్థిగా ఎంతవరకు అభివృద్ధిలో పాలు పంచుకోవాలో వివరించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాశాలలో తగ్గిపోయిన విద్యార్థుల సంఖ్యను పెంచడం, మరిన్ని కోర్సులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పచ్చదనం పెంపొందించడంతో పాటు కళాశాల ఆవరణలో మౌలిక వసతుల కల్పనకు వందశాతం పని చేయడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సెక్రటరీ రెడ్డెప్ప రాజు, ట్రెజరర్ మంజునాథ్, సభ్యులు సుఫి, రాజా, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులే జగనన్న రథ సారథులు



పెద్దతిప్పసముద్రంలో మాట్లాడుతున్న ఇరగం సుబ్బారెడ్డి

పెద్దతిప్పసముద్రం: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులే జగనన్న రథ సారథులని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఇరగం సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రెడ్డిశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం పీటీఎంలో మండల స్థాయిలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. సచివాలయ వ్యవస్థ, నవ రత్నాల పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. అర్హతే ప్రామాణికంగా అమలు చేసిన పథకాలను క్షుణంగా వివరించి మళ్ళీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా, ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిని గెలిపించుకుందామన్నారు. మండల నాయకులు మహమూద్, ట్రిప్ రమణ, సుబ్బరాం, శివన్న, కొండా సిద్ధార్థ, శంకర్, కేవీ రమణ, చంద్రశేఖర్, సురేంద్ర తదితరులు మాట్లాడారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

కురబలకోట: 2024లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పనిచేయాలని నియోజక వర్గ పార్టీ పరిశీలకులు ఇరగం సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. మండలానికి సంబంధించి శనివారం కనసాని వారిపల్లె గ్రామ సర్పంచ్ ఆర్‌కె కృష్ణారెడ్డి ఇంటి వద్ద జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి. దస్తగిరి , మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, సురేంద్రనాథ్, పెద్ద మండ్యం రెడ్డిశేఖర్‌రెడ్డి, డీఆర్ ఉమాపతిరెడ్డి, కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, ఆర్‌కె కృష్ణారెడ్డి, ఆర్సీ ఈశ్వర్‌రెడ్డి, గంట్ల సురేంద్ర, కోళ్ల వాసుదేవరెడ్డి, వసంతరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బండపల్లె కృష్ణారెడ్డి, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండో సారి వైఎస్ జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యం

ములకలచెరువు : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండో సారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పనిచేయాలని నియోజకవర్గ పరిశీలకులు ఈరగం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రైవేటు కళ్యాన మండపంలో జరిగిన అవగాహనే కార్యక్రమంలో పరిశీలకులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరవేయాలని సూచించారు. ఎంపీపీ సాయి లీలా, మండల కన్వీనర్ మాధవరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గౌరీశంకర్‌రెడ్డి, జేసీఎస్ గోర రవీంద్రారెడ్డి, ఆర్బీకే చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, పద్మశాలి డైరెక్టర్ సురేంద్రానాథ్, సిద్దారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.